క్లుప్తంగా

ఘనంగా దర్వేష్‌అలీ ఉత్సవాలు



ధరూరు: మండల కేంద్రంలో దర్వేష్ అలీ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గట్టు బస్టాండ్ వద్ద ఉన్న దర్వేష్ అలీ దర్గాను కులమతాలకు అతీతంగా ప్రజలు దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం మొక్కులు తీర్చుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అయిజ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ నీలి గోవింద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతో పాటు బింగుదొడ్డి, జడ్డొడ్డి, ఎక్లాస్‌పూర్, దేవబండ గ్రామాలకు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

అలంపూర్: పట్టణంలోని బీఆర్‌ఎస్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మంజుల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్ సంతోష్ హాజరవుతారని పేర్కొన్నారు.

రేపు ఇటిక్యాలలో..

ఇటిక్యాల: మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భద్రప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై భూ భారతి చట్టం, అందులోని వివిధ అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు రైతుల సందేహాలను నివృత్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల రైతు సంఘాల నాయకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తహసీల్దార్ కోరారు.

శేషదాసుల వారికి రథం వితరణ



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శేషదాసుల వారికి ఆదివారం మల్దకల్‌కు చెందిన దామ శంకరయ్య, పార్వతమ్మ రథం వితరణ చేశారు. ప్రతి ఏటా నిర్వహించే ఆరాధనోత్సవాల్లో భాగంగా శేషదాసుల స్వామికి రథోత్సవం నిర్వహించేందుకు రూ.5లక్షల వ్యయంతో నూతన రథం తయారు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు మధుసూదనాచారి, శశాంక, రవిచారి, ధీరేంద్రదాసు పాల్గొన్నారు.

యువజన కమిటీ ఎన్నిక

గట్టు: ఎస్‌ఎస్‌కే సమాజ్ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా గట్టుకు చెందిన మల్లికార్జున్ రఘు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని భవానీ మాత ఆలయంలో యూత్ సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కొర్విపాడు మంజు, మల్లంపల్లి శ్రీను, కార్యదర్శులుగా పాపురం శివుడు, మల్లంపల్లి శేఖర్, శివుడు, కోశాధికారులుగా చందు, కొర్విపాడు వినోద్, నడిమింటి రాము, గౌరవ సలహాదారులుగా వెంకటేశ్, సురేశ్, ఆనంద్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వినోద్, అర్షిద్, అఖిల్ తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పిడుగుపాటుతో రెండు ఎద్దులు మృతి

మల్దకల్: పిడుగుపాటుతో రెండు ఎద్దులు మృతిచెందిన ఘటన మండలంలోని చిప్పదొడ్డి గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చిప్పదొడ్డికి చెందిన రామన్‌గౌడు ఇటీవల రూ. 2లక్షలు వెచ్చించి రెండు కాడెద్దులను కొనుగోలు చేశారు. రోజులాగే పొలం పనులు ముగిసిన తర్వాత అక్కడే పొలం వద్ద వాటిని ఉంచాడు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం పడింది. ఈ క్రమంలో పిడుగుపాటుకు గురై రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతిచెందాయి. బాధిత రైతును ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

భవనం.. నిరుపయోగం



అయిజలో నిరుపయోగంగా ఉన్న పోలీస్‌స్టేషన్ పాత భవనం

- వినియోగానికి నోచుకోని పోలీస్‌స్టేషన్ పాత భవనం
- ఆరేళ్లుగా ఖాళీగానే..
- వివిధ ప్రభుత్వ శాఖలకు భవనాలు లేక అవస్థలు

అయిజ: పట్టణంలోని గాంధీచౌక్ కాలనీలో ఉన్న పోలీస్‌స్టేషన్ పాత భవనం వినియోగానికి నోచుకోవడం లేదు. 45ఏళ్ల క్రితం ఈ భవనాన్ని నిర్మించగా.. దాదాపుగా 38 ఏళ్లపాటు పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించారు. అయితే ఆరేళ్ల క్రితం పట్టణంలోని ఉత్తనూరు రోడ్డు పక్కన పోలీస్‌స్టేషన్ నూతన భవనం నిర్మించడంతో పోలీసులు తమ కార్యకలాపాలను అందులోకి మార్చారు. నాటి నుంచి పోలీస్‌స్టేషన్ పాత భవనం నిరుపయోగంగా ఉంది. పలు ప్రభుత్వ శాఖలకు పట్టణంలో భవనాలు లేకపోవడంతో అటు అధికారులు, ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్‌స్టేషన్ పాత భవనాన్ని ఏదో ఒక శాఖ అధికారులు వినియోగించుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా పలు శాఖల అధికారులు వారి కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు సదరు భవనాన్ని అప్పగించాలని పోలీస్‌శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయితే పోలీస్‌శాఖ అధికారులు మాత్రం ఇతర శాఖలకు భవనం అప్పగించేందుకు ఒప్పుకోవడం లేదు. పోలీస్ శాఖకు సంబంధించిన పనులకు పాత భవనాన్ని వినియోగించుకుంటామని చెబుతున్నారు. కానీ ఇంతవరకు అటువైపు అడుగులు పడటం లేదు.

ఇరుకు గదుల్లో ప్రభుత్వ కార్యాలయాలు..

పట్టణంలో వివిధ ప్రభుత్వ శాఖలకు కార్యాలయ భవనాలు లేవు. ముఖ్యంగా వ్యవసాయశాఖ, మెప్మా కార్యాలయాలకు భవనాలు లేకపోగా.. మరికొన్ని శాఖల కార్యాలయ భవనాలు ఇరుకుగా ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉంది. స్టోర్‌రూం కూడా లేదు. గ్రంథాలయ భవనం కూడా పూర్తిగా శిథిలం కావడంతో అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

ఇతర శాఖలకు అప్పగించేందుకు ససేమిరా..

ఆరేళ్లుగా పోలీస్‌స్టేషన్ పాత భవనం నిరుపయోగంగా ఉండగా.. సంబంధిత శాఖ అధికారులు ఆ భవనాన్ని కనీసం ఔట్ పోస్ట్‌కు కూడా ఉపయోగించుకోవడం లేదు. ఇతర శాఖలకు కూడా భవనాన్ని అప్పగించడం లేదు. నాలుగేళ్ల క్రితం మున్సిపల్ శాఖ అధికారులు పాత భవనాన్ని అప్పగించాలని పోలీస్ శాఖ ఉన్నతాధికారులను కోరారు. గతేడాది విద్యుత్‌శాఖ అధికారులు కూడా విజ్ఞప్తి చేయగా.. పోలీస్ శాఖ ఉన్నతాధికారులు మాత్రం అందుకు ఒప్పుకోవడం లేదు.

శిథిలావస్థకు చేరుకుంటుంది..



పాత భవనాన్ని పోలీసులు ఖాళీ చేసి ఆరేళ్లు అవుతుంది. అప్పటి నుంచి భవనం నిరుపయోగంగా మారడంతో శిథిలావస్థకు చేరుతుంది. తలుపులు, కిటికీలు చెదలు పడుతున్నాయి. ఇలాగే వదిలేస్తే భవనం పనికిరాకుండా పోతుంది. అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

– మహేశ్, అయిజ

వినియోగంలోకి తేవాలి..



వివిధ శాఖల కార్యాలయాలకు భవనాలు లేవు. పట్టణంలో నిరుపయోగంగా ఉన్న పోలీస్‌స్టేషన్ పాత భవనాన్ని ఏదో ఒక శాఖ సద్వినియోగం చేసుకుంటే బాగుంటుంది. లేదంటే పోలీస్ శాఖ వారు ఆ భవనాన్ని ఏదో ఒక పనికి సద్వినియోగం చేసుకోవాలి. భవనం వాడుకలో లేకుంటే శిథిలమైపోతుంది.

– నజీర్, అయిజ

ఔట్ పోస్టుకు ఉపయోగించుకుంటాం..



పోలీస్‌స్టేషన్ పాత భవనాన్ని ఇతర శాఖల అధికారులు సద్వినియోగం చేసుకుంటామని అంటున్నారు. అయితే దాన్ని ఔట్ పోస్ట్‌గా మార్చాలనే ఆలోచనలో పోలీస్ ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే ఆ భవనాన్ని సద్వినియోగం చేసుకుంటాం.

– శ్రీనివాసరావు, ఎస్‌ఐ

ఉత్సాహంగా సందెరాళ్ల పోటీలు



సందెరాళ్ల పోటీల్లో పాల్గొన్న యువకులు

గట్టు: మండలంలోని బల్గెర గ్రామంలో దిగంబర స్వామి జాతరను పురస్కరించుకొని ఆదివారం సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల నాయకుడు బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వివిధ గ్రామాలకు చెందిన యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాగా, దిగంబరస్వామి జాతర సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అంగడి బస్వరాజు, నూర్‌పాషా, వెంకటేశ్, గోపాల్, రాము, వీరేశ్, బొజ్జయ్య నాయక్, కర్రెప్ప, హనుమంతు, వీరన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి కార్యకర్తలే వెన్నెముక



అయిజ పట్టణ కమిటీ ప్రతిపాదిత జాబితా స్వీకరిస్తున్న స్నిగ్ధారెడ్డి

అయిజ: బీజేపీకి కార్యకర్తలే వెన్నెముక అని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. ఆదివారం అయిజలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీకి సంబంధించిన ప్రతిపాదిత జాబితాను పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా స్నిగ్ధారెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి శాయశక్తులా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు భీమసేన రావు, ప్రదీప్‌కుమార్, శివారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, స్వప్న, ఓబుల్ రెడ్డి, లక్ష్మణాచారి పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

ఎర్రవల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండ అధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బీచుపల్లిలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. దేశంలో ఏ పార్టీకి లేని ఆదరణ 18కోట్ల సభ్యత్వాలు కలిగిన బీజేపీకి మాత్రమే ఉందన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎలాంటి అవినీతికి తావులేకుండా ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కష్టపడి పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జయలక్ష్మి, రామకృష్ణ, పరశురాం, శివరాంరెడ్డి, మహేశ్, విజయ్, మల్లేష్, నరేశ్, నర్సింహారెడ్డి, రాముడు, జనార్దన్‌రెడ్డి, మహేంద్ర, రాజు, నవీన్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం

గట్టు: క్షేత్రస్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కలిసికట్టుగా పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అక్కల రమాదేవి సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం మండల కమిటీ ఏర్పాటుపై చర్చించారు. 65 మందితో నూతనంగా ఏర్పాటుచేసే కమిటీలో ప్రతి గ్రామం నుంచి ఇద్దరు లేదా నలుగురికి చోటు కల్పించాలని స్థానిక నాయకులు ఆమెకు వినతిపత్రం అందించారు. బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మధుసూదన్‌రావు, బల్గెర నల్లారెడ్డి, మాచర్ల సురేశ్, కిట్టుస్వామి, మొద్దు సంజీవనాయుడు, నర్సింహులు, వెంకటేశ్, సోమన్న, లింగన్న, రంగనాయుడు, నర్సింహులు, రాముడు, శివ ఉన్నారు.

సరస్వతిమాత విగ్రహావిష్కరణ



సరస్వతిమాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎర్రవల్లి: బీచుపల్లి గురుకుల పాఠశాలలో 2010–11 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సరస్వతి మాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తమతో కలిసి చదువుకున్న భరత రాజన్ ఏడాది క్రితం మృతిచెందగా.. అతడి జ్ఞాపకార్థం రూ. 70వేల వ్యయంతో పాఠశాల ఆవరణలో చదువుల తల్లి సరస్వతి మాత విగ్రహాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నాసిరకంగా బీటీ రోడ్డు మరమ్మతు



మానవపాడు సమీపంలో కొత్తగా వేసిన బీటీరోడ్డు దుస్థితి

మానవపాడు: మండల కేంద్రం నుంచి అలంపూర్ చౌరస్తా వరకు ఉన్న బీటీరోడ్డుకు ఇటీవల చేపట్టిన మరమ్మతు పనులు మున్నాళ్ల ముచ్చటగా మారాయి. మానవపాడు నుంచి చెన్నిపాడు పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాల మీదుగా వెళ్లే బీటీరోడ్డు పదేళ్లుగా మరమ్మతుకు నోచుకోక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంతల రహదారిపై రాకపోకలు సాగించడం నరకప్రాయంగా ఉండేది. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితం కలెక్టర్ ఆదేశాల మేరకు రూ. 10లక్షలతో బీటీరోడ్డుకు మరమ్మతు చేశారు. అయితే నాణ్యతగా పనులు చేపట్టక పోవడంతో బీటీ ధ్వంసమై మళ్లీ గుంతల మయంగా మారుతోంది. ఈ రోడ్డును చూసిన వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు నాణ్యత నువెక్కడా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీరోడ్డు మరమ్మతు పనులు నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తాగునీరు వృథా



మల్దకల్: మండలంలోని ఎద్దులగూడెం పాఠశాల సమీపంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పారుతోంది. వేసవిలో తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఓవైపు అధికారులు సూచిస్తుండగా.. మరోవైపు తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలు మాత్రం మరమ్మతుకు నోచుకోవడం లేదు. ఎద్దులగూడెంలో తాగునీరు వృథా అవుతున్న విషయాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి



ఆలూరులో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి నినాదాలు చేస్తున్న మండల నాయకులు

గట్టు: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని మండల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఆలూరు, తుమ్మలచెరువు, రాయాపురం గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. రజతోత్సవ సభకు జనాన్ని సమీకరించాలని సూచించారు. అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అంగడి బస్వరాజు, రాము నాయుడు, వెంకటేశ్, రాయాపురం వీరేశ్, కర్రెప్ప పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



అలంపూర్: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహాంను ఆదివారం కర్నూలులో అలంపూర్ నియోజకవర్గ నాయకులు కలిశారు. మాజీ ఎమ్మెల్యే జన్మదినం కావడంతో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అబ్రహాం హయాంలో రూ. వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు



అమరచింత: మండలంలోని ఈర్లదిన్నెలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహిస్తున్న ఓపెన్‌టూ ఆల్ కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. కబడ్డీ పోటీలకు వెస్ట్ గోదావరి, అనంతపురం, ప్యాప్లి, రంగారెడ్డి, బైంసా, గద్వాల, నారాయణపేట, వనపర్తి జిల్లాల నుంచి మొత్తం 10 జట్లు పాల్గొంటున్నాయి. గ్రామంలో కబడ్డీ పోటీలు చూసేందుకు వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి క్రీడాకారులు తరలివస్తున్నారు. మొదటి బహుమతిగా రూ.50వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాల్గో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ. 5వేలు అందించనున్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



ఇటిక్యాల మండలం గోపాల్‌దిన్నెలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



ఎర్రవల్లి చర్చిలో..

అయిజ/మానవపాడు/ధరూరు/ఎర్రవల్లి/ఇటిక్యాల/మల్దకల్: జిల్లావ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అయిజ పట్టణంలోని ఎంబీ బేతేలు చర్చిలో ఏసుక్రీస్తు జీవిత చరిత్రను ఫాస్టర్ తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనిస్తూ.. సాటి మనుషులపై ప్రేమానురాగాలతో మెలగాలని సూచించారు.

■ మానవపాడు మండలంలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు పాటించే లెంట్ సీజన్ కూడా ఆదివారంతో ముగిసింది.

■ ధరూరు మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చి, కల్వర్ చర్చిల్లో క్యాండిల్ లైటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఏసుక్రీస్తు తిరిగి లేచిన సందర్భాన్ని పురస్కరించుకుని బైబిల్ ఆధారంగా ఆయా చర్చిల ఫాస్టర్లు వాకోపదేశం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో ఫాస్టర్లు రవికుమార్, కృపరాజ్, అబ్రహం పాల్గొన్నారు.

■ ఎర్రవల్లి మండల కేంద్రంతో పాటు షేకుపల్లి, యాక్తాపురం, దువాసిపల్లి, కొండేరు, పుటాన్‌దొడ్డి, వల్లూరు, ధర్మవరం, గార్లపాడు, కారుపాకుల, వేముల తదితర గ్రామాల్లో ఈస్టర్ పండగను క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

■ ఇటిక్యాల మండల కేంద్రంతో పాటు షాబాద్, ఉదండాపురం, చాగాపురం, గోపల్‌దిన్నె, పెద్దదిన్నె, సాతర్ల, మునగాల గ్రామాల్లో ఈస్టర్ పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రార్థనా మందిరాల్లో ఫాస్టర్లు ప్రత్యేక సందేశాలు ఇచ్చారు.

■ మల్దకల్ మండల కేంద్రంతో పాటు అమరవాయి, బిజ్వారం, ఎల్కూరు, తాటికుంట, నాగర్‌దొడ్డి, విఠలాపురం, పాల్వాయి, కుర్తిరావుల చెర్వు గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.



అయిజలో ఎంబీ బేతేలు చర్చిలో..



మల్దకల్ మండలం కుర్తిరావులచెర్వులో..

అడుగులోతు నీటిలో అంతిమ సంస్కారం



అడుగులోతు నీటిలోనే చిన్నరామకోటి అంత్యక్రియలు నిర్వహిస్తున్న బంధువులు

ఇటిక్యాల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఈ క్రమంలో షాబాద్ గ్రామంలో ట్రాక్టర్ బోల్తాపడిన ప్రమాదంలో మృతిచెందిన రైతు తెలుగు చిన్న రామకోటి (65) అంత్యక్రియలు నిర్వహించేందుకు అతడి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంలోనే అంతిమ యాత్ర నిర్వహించారు. అప్పటికే శ్మశాన వాటికలో తీసిన గోతిలో అడుగులోతు వరకు వర్షపునీరు వచ్చి చేరగా.. అందులోనే ఖననం చేశారు. మరణించిన వ్యక్తి అంత్యక్రియలకు పంచ భూతాలైన నీరు, గాలి, అగ్ని (అగరబత్తులు), నేల, ఆకాశం కలిసి వచ్చాయని పలువురు చర్చించుకున్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



అగ్నిమాపక వారోత్సవాల ముగింపులో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆత్మకూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వారం రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో చివరిరోజు సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విన్యాసాలతో క్లుప్తంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావ్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల బారిన పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారం రోజులపాటు ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అనంతరం వారోత్సవాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కృష్ణ, బీమేశ్వర్‌రెడ్డి, సంజీవరెడ్డి, నాగార్జున్, శ్రీనునాయక్, నర్సింహారెడ్డి, రాముడు, సందీప్‌రెడ్డి, భానుచందర్‌రెడ్డి, వెంకటనర్సయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.